క్లుప్తంగా

నాడు నేడు పనుల్లో పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ అనురాధ

ఉయ్యాలవాడ: మన బడి నాడు నేడు పనుల్లో పురోగతి సాధించాలని ఎంఈఓ అనురాధ సూచించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో నాడు నేడు పాఠశాలల హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా మౌలిక వసతుల కల్పనలో భాగంగా 9 రకాల పనులను పూర్తి చేయాలన్నారు. మండల పరిధిలోని 17 పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ఆయా ప్రధానోపాధ్యాయులఖాతాల్లో రూ.1,85,20,000 జమ చేసిందన్నారు.ఇప్పటి వరకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రూ.1,19,46,000 అభివృద్ధి పనులకు ఖర్చు చేశారన్నారు. ఇంకా రూ. 65,79,000 సంబంధించిన పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఉయ్యాలవాడ, మాయలూరు పాఠశాలల్లో మరుగుదొడ్లు, బాత్‌రూంల పనులు నత్తనడకన సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

రాయలసీమకు నీళ్లు నిధులు ఇవ్వాలి

శిరివెళ్ల: వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి సమాన వాటాగా నీళ్లు, నిధులు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కటిక సెంటర్‌లో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ వ్యాప్తంగా 52 నియోజక వర్గాల్లో సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. సీమలోని పెండింగ్ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీమలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ప్రతి పార్టీ సీమకు న్యాయం చేస్తామని చెబుతూ ఆ తర్వాత విస్మరిస్తున్నారన్నారు.

తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి

గోస్పాడు: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈఓఆర్డీ నాగేంద్రుడు సూచించారు.స్థానిక కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున గ్రామాల్లో ప్రజలకు అవసరమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. తాగునీటి పథకాలు ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలన్నారు. నీటి పథకాల్లో క్లోరినేషన్ పద్ధతులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


నీరు నిల్వ ఉంచుకోవద్దు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యం

గోస్పాడు: ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు పారబోసి పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి డాక్టర్‌గోపాల్, జిల్లా సహాయక మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి సూచించారు. శుక్రవారం వారు కానాలలో పర్యటించారు. నిల్వ ఉన్న నీటిపై దోమలు వృద్ధి చెంది ప్రమాకరమైన డెంగీ, విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా శుభ్ర పరుచుకోవాలని సూచించారు. అనంతరం డెంగీ కేసు నమోదైన వ్యక్తి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌తో విజ్ఞానం



యోగా చేస్తున్న విద్యార్థులు

శిరివెళ్ల: స్థానిక గ్రంథాలయంలో కొనసాగుతున్న సమ్మర్‌క్యాంప్ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తోంది. పుస్తకాల పఠనం, స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించడంతో పాటు ఇష్టమైన ఆటలు నేరిప్తున్నారు. ఆరోగ్యం కోసం యోగాసనాలు చేయిస్తున్నారు.జాతీయనాయకుల జీవిత చరిత్ర పుస్తకాలు, నీతి కథల పుస్తకాలను విద్యార్థులు చదువుతున్నారు.క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ సుజాత కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

రుద్రవరం: మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. వినియోదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

డ్వాక్రా లెక్క.. ఇకపై పక్కా!

- కొత్తగా వినియోగంలోకి లోకోస్ యాప్
- బృంద చిత్రం, జీవనోపాధి, పొదుపు, వడ్డీరుణాలు, చెల్లింపులు ఒకే యాప్‌లో అప్‌లోడ్
- రుణాలు చెల్లించకపోవడం, నగదు కాజేత, నకిలీ సంఘాలు వంటి వాటికి చెక్
- పొదుపు సంఘాల సమగ్ర సమాచారం ఒకేచోట
- పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకం

పొదుపు సంఘాల లెక్కలు ఇకపై పక్కాగా ఉండనున్నాయి. సంఘంలోని మహిళలు పొందే రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, సంఘాల కార్యకలాపాలు, పొదుపు వివరాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయనున్నారు. గతంలో పొదుపు సంఘాల నిర్వహణను పర్యవేక్షకులు వేర్వేరు యాప్ ద్వారా చేసే వారు. ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ పథకాలపై అవగాహన, వ్యాపార లావాదేవీలు, లాభాలు తదితర సమాచార వివరాలు పక్కాగా ఉండేలా పేదరిక నిర్మూలన సంస్థ కొత్తగా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దేశ వ్యాప్తంగా పొదుపు సంఘాల వివరాలు ఇదే యాప్‌లో పొందు పరచనున్నారు.

– నంద్యాల



పొదుపు మహిళలు

నియోజకవర్గం	ఎస్‌హెచ్‌జీలు	మొత్తం సభ్యులు
ఆళ్లగడ్డ	5,539	58,387
బనగానపల్లె	6,719	69,517
నందికొట్కూరు	5,672	59,721
నంద్యాల	2,605	27,945
పాణ్యం	2,135	23421
శ్రీశైలం	4,817	51,002
డోన్	4,927	52,358
మొత్తం	32,414	3,42,370

ప్రస్తుతం వెలుగు విభాగం ద్వారా పొదుపు సంఘాలకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఎటువంటి లోటుపాట్లు ఉండేందుకు కొత్త యాప్ తీసుకొని వచ్చారు. ప్రస్తుతం లోకోస్ యాప్‌లో నమోదు ప్రక్రియ అంశాలపై శిక్షణా శిబిరాలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు డీఆర్‌డీఏ అధికారులకు శిక్షణ ఇచ్చారు. వీరు పొదుపు సంఘాలకు మండలా వారీగా శిక్షణ తరగతులు నిర్వహించి వివరాలు నమోదు చేయించారు.

వేర్వేరు యాప్‌లకు స్వస్తి

ఇప్పటి వరకు పొదుపు సంఘాల వివరాలు వేర్వేరు యాప్‌లలో నమోదు చేసే వారు. సంఘాల పనితీరు, ఆర్థిక లావాదేవీలు, ఇతర వివరాల నమోదు ఒక్కో యాప్‌ను వినియోగించేవారు. దీని వల్ల పలు సందర్భాల్లో తప్పులు జరిగేవి. సమాచార సేకరణ ఇబ్బంది ఉండేది. ఇకపై ఈ సమస్యకు చెక్ పడనుంది.

ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత

ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండేలా యాప్ ఉండనుంది. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 32,414 ఎస్‌హెచ్‌జీఎస్ గ్రూపులు ఉండగా 3,42,370 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఇందులో సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న వాయిదాల వివరాలను యాప్‌లో నమోదు చేయనున్నారు.

పక్కాగా అమలుకు కార్యాచరణ

యాప్‌లో ప్రతి సంఘానికి చెందిన బృంద చిత్రం, జీవనోపాధులు ఉంటే సంబంధిత చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. సభ్యుల సమగ్ర సమాచారం, ఉన్నతి, స్త్రీనిధి పథకాల ద్వారా మంజూరైన రుణాలు, పొదుపు నిల్వలు, సామాజిక పెట్టుబడి, అంతర్గత అప్పులు, సమావేశాలు, సంఘ తీర్మానాలు వంటి వివరాలు, వసూళ్లు, తదితర వివరాలు ఇందులో ఉండనున్నాయి. అంతేకాకుండా సభ్యురాలు మరణిస్తే వెంటనే పేరు తొలగించి కొత్త వారిని నమోదు చేసుకోవచ్చు. ఈ విధానంతో పొదుపు మహిళలకే మేలు అని పక్కాగా అమలు చేసేందుకు కార్యాచరణ డీఆర్‌డీఏ అధికారులు రూపొందించారు.

యాప్‌లో సమగ్ర సమాచారం



జిల్లాలోని పొదుపు మహిళల సమగ్ర సమాచారం లోకోస్ యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నాం. ఇప్పటికే డీఆర్‌డీఏ తరఫున మహిళలు, అధికారులకు అవగాహన కోసం శిక్షణ అందజేశాం. ఈ యాప్ అమల్లోకి వస్తే పొదుపు మహిళల లెక్కల్లో తేడా రాదు. అంతా పారదర్శకంగా ఉంటుంది. పొదుపు మహిళలకు లోకోస్ యాప్ ఎంతో ఉపయోగకరం.

– శ్రీధర్‌రెడ్డి డీఆర్‌డీఏ పీడీ, నంద్యాల

సంగమేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మించాలి

నంద్యాల(అర్బన్): సంగమేశ్వరం వద్ద బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే 60 టీఎంసీల నీటి నిల్వలతో రాయలసీమ ప్రాంత వాసుల సాగు, తాగునీటి సమస్య తీరుతుందని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బైరెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు రాజకీయ నాయకుల మౌనంతోనే అన్యాయం జరుగుతోందన్నారు. కర్ణాటకలో అప్పర్ భద్ర డ్యాం కడుతున్నా, సంగమేశ్వరం వద్ద తీగల వంతెన నిర్మించాలనుకుంటున్నా ఇక్కడి నాయకులు నోరు మెదపకపోవడం విడ్డూరమన్నారు. అప్పర్ భద్ర డ్యాం నిర్మిస్తే సీమలోని నాలుగు జిల్లాలు, తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. రాయలసీమ సమస్యల పరిష్కారం కోసం త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమ గల్లీ, గల్లీలో జై రాయలసీమ నినాదాలు మారుమోగినప్పుడే సీమకు న్యాయం జరుగుతుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు నవీన్‌కుమార్, రమణారెడ్డి, గోపాల్‌యాదవ్, నందకుమార్ యాదవ్, శివప్రసాదరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి పాము కాటు

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు గ్రామ సమీపంలో సరస్వతి అనే మహిళ ఉపాధి పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. తోటి కూలీలు ఆమెను రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంలో మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యర్రగుంట్లలో చోరీ

శిరివెళ్ల: యర్రగుంట్లలో శుక్రవారం చోరీ జరిగింది. గ్రామంలోని ప్రధాన వీధిలో ఉన్న ఓ మహిళ ఇంటిలోకి ఇరువురు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 5 తులాల బంగారం గొలుసు ఎత్తి కెళ్లి నట్లు గ్రామస్తుల సమాచారం. కాగా చోరీపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నెరవేరిన గ్రామ స్వరాజ్యం కల



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 4వ రోజు శుక్రవారం తెలుగుపేట, పాత పోస్టాఫీస్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం

శిరివెళ్ల: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న స్థలాలు సమాధులకు కూడా సరిపోవని పేదల మనోభావాలు దెబ్బతినేలా వ్యాఖ్యానించిన చంద్రబాబు దిష్టిబొమ్మను శుక్రవారం స్థానిక కటిక సెంటర్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరుతో ఊళ్లు నిర్మిస్తున్నారన్నారు. ఇది జీర్ణించుకోలేని చంద్రబాబు నాయుడు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పకుండా ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్‌సలాం, జెడ్పీ వైస్‌చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వషీం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరు ప్రతాపరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోమ్‌గార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

బొమ్మలసత్రం: విధులు నిర్వహిస్తూ మృతిచెందిన ఇద్దరు హోమ్‌గార్డు కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి అందించారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో మృతిచెందిన హోమ్‌గార్డులు మోహన్‌రెడ్డి, రమేష్ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించారు.

132 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలు

ఉయ్యాలవాడ: సంక్షేమ పథకాలను సకాలంలో లబ్ధిదారులకు అందించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలతో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిని గుర్తించి ప్రభుత్వం పురస్కారాలను అందజేయనుంది. మండల పరిధిలోని 132 మంది వలంటీర్లను ఈ ఏడాది పురస్కారాలకు ఎంపిక చేశారు. సేవా వజ్ర అవార్డుకు హరివరం, తుడుమలదిన్నె సచివాలయాల నుంచి రుద్రనాథ్‌రెడ్డి, ఎం.హరి, సేవారత్నకు బోడెమ్మనూరు,ఆర్.జంబులదిన్నె,ఇంజేడు, అల్లూరు, ఉయ్యాలవాడ సచివాలయాల వలంటీర్లు హరిప్రసాద్, పెద్ద హుసేని, లక్ష్మి ఓబులేసు, సుమలత, గురు లక్ష్మి ఎంపికయ్యారు. సేవా వజ్ర అవార్డు గ్రహీతలకు రూ.30 వేల నగదు, సర్టిఫికెట్, సేవా రత్న అవార్డు గ్రహీతలకు రూ.20 వేల నగదు, సర్టిఫికెట్, సేవా మిత్ర అవార్డు గ్రహీతలకు శాలువ, బ్యాడ్జితో రూ.10 వేల నగదు పురస్కారం అందజేయనున్నారు. అవార్డులకు ఎంపికైన వలంటీర్లు మాట్లాడుతూ ఈ అవార్డులు మరింత బాధ్యత పెంచాయన్నారు.

జవాబుదారీగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యల తప్పవన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మిదేవి, వైస్ ఎంపీపీలు నాసారి ప్రసాద్, దాదాపీర్ ఉన్నారు

సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పుచ్చలపల్లె సుందరయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు తోట మద్దులు కోరారు. సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట మద్దులు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుల్లా నరసింహ, గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని 15వ వార్డు గోపాల్‌నగర్‌లో కౌన్సిలర్ అనూష ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. నవరత్నాలు, సంక్షేమ ఫలాలతో ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలబడి రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ వెంకటదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు సాయిరాంరెడ్డి, ప్రతాపరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రామసుబ్బయ్య, శీను, సంపత్, కిశోర్, జమాల్, ఏసన్న పాల్గొన్నారు.

ముగ్గురు మహిళా దొంగల అరెస్ట్

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రయాణికుల బ్యాగులు దొంగిలించే ముగ్గురు మహిళలను శుక్రవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఎస్ఐ గంగయ్యయాదవ్ తెలిపిన వివరాలు.. సున్నిపెంటకు చెందిన పి.నాగజ్యోతి గత 13న దోర్నాల నుంచి సున్నిపెంటకు ఆర్టీసీ బస్సులో వచ్చి దిగుతుండగా తన బ్యాగును దొంగిలించారని, అందులో రూ.31,500 నగదు ఏటీఎం కార్డు ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 16న ఎం.శిరీష విశాఖపట్నం నుంచి సున్నిపెంటకు వస్తుండగా ఆమె బ్యాగులో ఉన్న 31.123 తులాల బంగారు నగలను దొంగిలించారని ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లోని సీసీ టీవీ పుటేజీలను పరిశీలించి నంద్యాల వైఎస్ఆర్ నగర్‌కు చెందిన నగనూరి.ఉషాకుమారితోపాటు రాజమండ్రికి చెందిన రావుల లక్ష్మి, తొండ పోశమ్మలను లింగాలగట్టు బ్రిడ్జి వద్ద అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నగదు, బంగారాన్ని రికవరీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌లో జేవీవీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, న్యాయవాది శంకరయ్యలు మాట్లాడుతూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేతను అరెస్ట్ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు వెంకటలింగం, సుబ్బారావు, లక్ష్మణ్, కేఎండీ గౌస్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ యువ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శబరి

నంద్యాల(వ్యవసాయం): భారతీయ జనతా పార్టీ యువ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బైరెడ్డి శబరిని ఎన్నుకున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ శుక్రవారం తెలిపారు. గన్నవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రకటించారన్నారు.

పేదోడి ఫ్రిజ్‌లకు భలే గిరాకీ



కుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

నంద్యాల(అర్బన్): వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు ప్రజలు పేదోడి ఫ్రిజ్‌లుగా పిలువబడే మట్టి కుండల కొనుగోళ్లకు డిమాండ్ పెరిగింది. ఇటీవల వారం రోజుల పాటు అకాల వర్షాలు కురియడంతో వేసవి తాపం మరింత పదునెక్కింది. దీంతో మట్టి కుండలకు గిరాకీ ఏర్పడింది. మే, జూన్ మాసం వరకు కుండల విక్రయాలు జోరుగా సాగనున్నాయి. కుండల విక్రయాలు మార్చి మాసం నుండి ఏప్రిల్, మే, జూన్ వరకు జరుగుతాయని, అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో ఏడాది పొడవునా జీవించేందుకు వీలుంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. పట్టణంలోని సాయిబాబానగర్ ఆర్చి సమీపం, బాలాజీ కాంప్లెక్స్, మెయిన్‌బజార్ అమ్మవారి శాల, ఆర్టీసీ బస్టాండ్, బొమ్మలసత్రం, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో పెద్ద సంఖ్యలో మట్టి కుండల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్లాస్టిక్ వస్తువుల రాకతో మట్టి కుండల అవసరం కొంత వరకు తగ్గినా వేసవి సీజన్ వచ్చిందంటే పేదోడి ఫ్రిజ్‌లకు మంచి గిరాకీ లభిస్తుంది. ఆళ్లగడ్డ, రుద్రవరం, బనగానపల్లె మైదుకూరు, ప్రొద్దుటూరు వద్ద ఉన్న చౌడూరు, మహానంది, మండలంలోని తమ్మడపల్లె తదితర గ్రామాల నుంచి కుండలు కొనుగోలు చేసుకొని వ్యాపారులు స్థానికంగా విక్రయిస్తున్నారు. ఒక్కొక్క కుండ ఖరీదు సైజును బట్టి రూ.120 నుంచి రూ.180ల మధ్యన విక్రయిస్తున్నారు. ఒక బిందె నీరుపట్టే కుండ మాత్రం రూ.150 నుంచి రూ.200 మధ్యన విక్రయిస్తున్నారు. హైదరాబాద్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, తెనాలి, తదితర ఇతర ప్రాంతాల నుంచి తెచ్చే ఎర్రకుండలు నాణ్యతను బట్టి ధరలను విక్రయిస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వీటిని తీసుకొని రావడానికి ట్రాక్టర్ల ద్వారా అయితే రూ.8వేలు, లారీల ద్వారా అయితే రూ.16వేలకు పైగా ఖర్చు అవుతుందని, రవాణాలో ఏవైన కుండలు దెబ్బతింటే తీవ్ర నష్టాలు భరించాల్సి వస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఒక్కొక్క ఎర్రకుండు విలువ కూడా రూ.180 నుంచి రూ.250ల మధ్యన అమ్మకాలు జరుగుతున్నాయి. కుండల నుంచి నీటిని తోడుకోవడం కష్టమవుతున్నదని భావించిన వారికి కొళాయి ఏర్పాటు అయిన కుండలపై మరో రూ.70 నుంచి రూ.90 అదనపు ధరతో విక్రయిస్తున్నారు. నంద్యాల పట్టణంలో వేసవికాలంలో కనీసం 50వేలకు పైగా కుండలను విక్రయిస్తున్న సమాచారం. కుండల వ్యాపారంతో ఆర్థికంగా నిలదొక్కుకోలేక పోతున్నామని వ్యాపారులు పేర్కొంటున్నారు.

వేసవి కాలంలో కుండ నీళ్లే మేలు

తక్కువ ఖరీదుతో దొరికే మట్టి కుండల నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు. పనుల మీద బయటకు వెళ్లి వచ్చిన ప్రతి సారి కుండనీరు తాగితే మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇంట్లోని వారందరం మార్చి నెల ఆరంభం నుండే కుండల నీటిని తాగుతున్నాం. ఫ్రిజ్‌లలో నీటిని తాగాలంటే ఇబ్బందిగా ఉంటుంది. కుండ నీరు పూర్తి చల్లగా కాకుండా మామూలుగా ఉంటాయి. కాబట్టి చిన్నారులు సైతం అదే నీటిని తాగుతున్నారు.

–ఏహియా, పోలూరు

నాలుగు మాసాల వ్యాపారమే

కుండల వ్యాపారం ఏడాదిలో కేవలం నాలుగు మాసాలు మాత్రమే విక్రయాలు జరుగుతాయి. మిగిలిన ఎనిమిది మాసాలు సీజన్‌లో వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొని రావాల్సి వస్తుంది. మొదటి నుంచి కుండల వ్యాపారం మీదనే కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నా. ఏడాది పొడవునా కుండల వ్యాపారం ఉన్నా అరకొర ఆదాయం మాత్రమే వస్తుంది. సీజన్‌లో మాత్రం కొంత ఆదాయం మిగులుతుంది.

–కోదూరు నాగన్న, కుండల వ్యాపారి